www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023
5
వైఎస్ఆర్

అమరజీవి త్యాగం అందరికీ ఆదర్శనీయం

పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి

వార్త....6లో

అర..కొరే!

- 2025 నాటికి జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2
- 'ఉక్కు' రూ.2,200 కోట్లు కేటాయింపు
- కొప్పర్తి, వైఎస్ఆర్ ఇఎంసి ప్రస్తావన
- రాయచోటిలో పారిశ్రామిక శిక్షణా సంస్థ
- పులివెందుల్లో ముర్రాజాతి గేదెల ఉత్పత్తి
- యోగి వేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్-2023 అరకొర కేటాయింపులతో సరిపెట్టింది. జిల్లా ప్రగతి చోదకశక్తులైన ఇరిగేషన్, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాలకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయలేదు. జిల్లాలో ఉక్కు పరి శ్రమ ఏర్పాటుకు రూ.2,200 కోట్లు, పులివెందులలో ముర్రాజాతి గేదెల ఉత్పత్తి, కొప్పర్తి పారిశ్రామికవాడ, వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పన, రాయచోటిలో పారిశ్రామిక శిక్షణా సంస్థ వంటి పేర్లతో ఊరట కలిగించే ప్రయత్నం చేయడం గమనార్హం. నిధుల కేటాయింపుల వివరాలల్లో స్పష్టత కనిపించకపోవడం నిరుత్సాహాన్ని కలిగించింది. ఏదేమైనా జిల్లాలో సాగునీటి పారుదల, పారిశ్రామిక రంగాల కేటాయింపులను పరిశీలిస్తే మొక్కుబడి కేటాయింపుల్ని తలపించిందని చెప్పవచ్చు. రాష్ట్ర బడ్జెట్ -2023-24ను ఆర్థికశాఖామంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి రూ.2,79, 279 కోట్లతో ప్రవేశపెట్టారు. జిల్లాకు సంబంధించిన కేటాయింపులను పరిశీలిస్తే నిరుత్సాహన్ని కలిగించింది. సాగునీటి పారుదల రంగ కేటాయింపులను పరిశీలిస్తే జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్, కెసికెనాల్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలతో ముడిపడి ఉండడంతో స్పష్టత లోపించింది. గతేడాది జిఎన్ఎస్ఎస్‌కు రూ.439. 30కోట్లు కేటాయించగా తాజాగా రూ.855.35 కోట్లు, పిబిసికి గతేడాది రూ.238.95 కోట్లు కాగా తాజాగా రూ.106.59 కోట్లు, హెచ్ఎన్ఎస్‌కు రూ.122.69 కోట్లు, వెలిగల్లుకు రూ.1.5 కోట్లు, చెయ్యేరుకు రూ.20 లక్షలు కేటాయింపులతో సరిపెట్టారు. గత బడ్జెట్‌లో సాగు నీటిపారుదల రంగానికి రూ.8,087 కోట్లు కేటాయించడం తెలిసిందే. 2023-24 బడ్జెట్‌లో రూ.1542.17 కోట్లు కేటాయించినట్లు కనిపి స్తోంది. పారిశ్రామిక రంగాన్ని పరిశీలిస్తే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రూ.2,200 కోట్లు, కొప్పర్తి, వైఎస్ఆర్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుతో 35 వేల ఉద్యోగాలు వస్తాయనే మొక్కుబడి ప్రస్తావన చేసింది. పులివెందుల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పులివెందుల్లో వెటర్నరీ బయోలాజికల్ ఇన్సిట్యూట్‌లో ముర్రాజాతి గేదెల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. యోగి వేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు, సిపిబ్రౌన్‌కు రూ.10 లక్షలు, చొప్పున కేటాయించారు. ఉమ్మడి జిల్లాలోని 4.80 లక్షల మంది రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా, రూ.500 కోట్లతో సున్నా వడ్డీ పథకం కింద లబ్ధిపొందనున్నారు. జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడేషన్, ఉమ్మడి జిల్లాలోని అన్నమయ్య, పింఛా, ఎల్ఎస్‌పి, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులకు సంబంధించిన కేటాయింపుల ప్రస్తావన చేయలేదు.

కాకి లెక్కల బడ్జెట్

జగన్ ప్రభుత్వం, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర ప్రవేశపెట్టిన 2023-24 రాష్ట్ర బడ్జెట్ 'కాకి లెక్కల బడ్జెట్' గా ఉంది. ఉత్పాదక, ఉపాధి రంగానికి రాష్ట్ర బడ్జెట్లో కేవలం రూ. 30 వేల కోట్లు మాత్రమే చూపించారు. గతలోనూ 32 వేల కోట్లు చూపించి, రూ. 16 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. 'జాబ్ క్యాలెండర్' ప్రస్తావన లేకుండానే ముగించేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల కింద పంట కాలవల నిర్మాణానికి నిధులు ఈ బడ్జెట్లో విస్మరించారన్నారు.

-జి. చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికావు

2023-24 వార్షిక సంవత్సరానికి రూ. 2,79,279 లక్షల కోట్ల కేటాయింపులో నీటి పారుదల , పారిశ్రామిక రంగాలనే పూర్తిగా విస్మరించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి కూడా కావు. జిల్లాలో గాలేరు-నగరి, హంద్రీ నీవా, రాజోలి నిర్మాణ, తెలిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పూర్తవడం సాధ్యం కాదు. వ్యవసాయ రంగానికి నిధులను అంకెల గారడితో కేటాయించారు.

- గాలి చంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి.

పారిశ్రామిక అభివృద్ధి అసాధ్యం

బుగ్గన ప్రవేశపెట్టిన 2023 -24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ వల్ల రాష్ట్ర అభివృద్ధి ఏమాత్రం జరగదని, కేవలం సంక్షేమానికి మాత్రమే కొద్దిగా ప్రాధాన్యతను ఇచ్చారు. పారిశ్రామిక అభివృద్ధికి ఈ బడ్జెట్లో ఒరిగిందేమీ లేదన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి రూ. 20 కోట్లు కేటాయించి ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి బయటపడి ఉండేది. నిరుద్యోగులకు మొండిచెయ్యి చూపించారు.

- కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు

విద్యారంగానికి తూట్లు

2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 10.6 శాతం నిధులు కేటాయించిందని, గత సంవత్సరంతో పోల్చితే 0.2 తక్కువ నిధులు కేటాయించడం దారుణమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగిందని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం అమ్మఒడికి ఒక్క రూపాయి అదనపు కేటాయింపులు చేయలేదు.

- యుటిఎఫ్ అధ్యక్షులు మాదన విజయ కుమార్

రైతుకు భరోసా ఇవ్వని బడ్జెట్

వ్యవసాయం, అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు తగినంతగా లేవు. పంట రుణాలకు రూ.2500 కోట్లు అవసరమైతే రూ.500 కోట్లు కేటాయించారు. డ్రిప్ పరికరాలను మెట్ట ప్రాంత రైతులకు అందించడానికి అవసరమైన నిధులు కేటాయించకపోవడం శోచనీయం.

-బి. దస్తగిరిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నిరుద్యోగులకు నిరాశ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో అన్ని రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామైనప్పటికీ నిరుద్యోగులకు ఒకరకంగా ఇది నిరాశ పరిచినట్లే చెప్పవచ్చును. నూతన ఉద్యోగ నియామకాలు మీద బడ్జెట్‌లో ప్రస్తావన లేక పోవడం బాధాకరం. రోజుకు పెరుగుతున్న మానవ వనరుల దృష్టిలో పెట్టుకొని సంబంధించిన ఉద్యోగ నియామకాలు చేపడితే సుస్థిరంగా అభివృద్ధి సాధ్యమవుతుంది.

-డాక్టర్ రమేష్ పిచ్చాయ్. ఆర్థిక శాఖ విశ్లేషకులు, కడప.

అకాల వర్షం.. రైతులకు నష్టం

- పులివెందుల నియోజవర్గంలో వందల ఎకరాల్లో నేలకొరిగిన మామిడి

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో కురిసిన అకాల వర్షం కొంత ఉపసమనంతోపాటు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వేసవి తాపానికి తల్లడిల్లుతున్న ప్రజానీకానికి కొంత ఉపశమనాన్ని కల్పించింది. నగర వాసులకు ఈ వర్షంతో ఎండ తాకిడి నుంచి కొంతవరకు బయటపడ్డారు. జిల్లాలోని వివిధ మండలాలలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడి, చీని, నిమ్మ తోటలో కాయలు నేలరాలాయి. ముఖ్యంగా పులివెందుల నియోజకర్గంలోని వేంపల్లె, చక్రాయపేటలో ఈదురు గాలులుతో కూడిన వడగంట్ల వాన పడింది. దీంతో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. కాపుకొచ్చిన మామిడి కాయలు వంద ఎకరాల్లో నేలకొరిగాయి. వాతావరణ శాఖ ఇటీవలే వర్షాలు కురుస్తాయని ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. నగరంలో ఒక మోస్తారు వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు కొంతవరకు ఇబ్బంది పడ్డారు. తోపుడు బండ్ల వ్యాపారులు అర్ధాంతరంగా ఇళ్లకు వెన్ను దిగారు. మరో రెండు రోజులపాటు వర్షాలు ఉన్నట్లు వాతావరణ కేంద్రం ఇప్పటికే ప్రకటించింది.

చక్రాయపేట : ఈదురు గాలులకు నేలరాలిన మామిడి కాయలు

సిఎమ్‌డికి వినతి పత్రం అందజేస్తున్ననాయకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి : సిఐటియు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలోని విద్యుత్ ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తిరుపతిలో సిఎండి సంతోష్ రావుని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుదర్శన్ రెడ్డి, శివ శంకర్, నాయబ్ రసూలు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఇంటర్ చదివిన వారికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలిపారు. ఒంటి మిట్టలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 16 నెలల వేతనాలు చెల్లించాలని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. వీటన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నట్లు తెలిపారు.

రెండో రోజూ ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - కడప అర్బన్ /రాయచోటి

ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా కొనసాగాయి. ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, ఒకేషనల్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వ హించారు. 20,663 మంది విద్యార్థులకుగానూ 19,963 మంది హాజ రయ్యారు. 700 మంది గైర్హాజరయ్యారు. రైల్వే కోడూరులో పరీక్షా కేంద్రాన్ని ఆర్ఐఒ రమణ రాజు తనిఖీ చేశారు.

అన్నమయ్య జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కృష్ణయ్య మాట్లాడుతూ గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పేపర్-2 పరీక్షలో 13325 మంది విద్యార్థులకు గాను 12848 మంది పరీక్ష రాయగా 477 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు.

పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న డిపిఒ ప్రభాకర్‌రెడ్డి

మెరుగైన సేవలందించాలి : డిపిఒ

ప్రజాశక్తి - వల్లూరు

సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా పంచాయతీ అధికారి డి. ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన స్థానిక సచివాలయాన్ని గురు వారం వల్లూరు, పైడి కాలువ, జంగంపల్లి సచివా లయంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ప్రజలకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వల్లూరు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. హరిత రాయబారులకు తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సుప రిపాలనను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రామమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా నాయకుల సహకారంతో ముందుకెళ్తా

ప్రజాశక్తి - కడప

సదస్సులో పాల్గొన్న బండి సుమంత్

జిల్లా నాయకులు అందరి సహ కారంతో ముందుకు వెళతానని, రాబోవు రోజు ల్లో కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింతగా బలో పేతం చేస్తామని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షులుగా ఎంపికైన జిల్లా అధ్యక్షులకు వైజాగ్ లో రెండు రోజుల శిక్షణ, సదస్సులు నిర్వహించారు. జిల్లా నుంచి యువజన కాంగ్రెస్ నూతన జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన బండి సుమంత్ రెండు రోజుల సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల రాజకీయ అనుభవంతో యువజన కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షులుగా విజయం సాధించడం చాలా సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. రెండు రోజుల శిక్షణ, సదస్సు లో పాల్గొన్న మాకు నూతన ఉత్తేజం వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఎపి ఇన్‌ఛార్జి, సీనియర్ నాయకులు మేయప్పన్, క్రిస్టఫర్ సూచనలు, సలహాలతో పాటు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు ఆదేశానుసారం జిల్లా కాంగ్రెస్ పార్టీ విభాగం యువజన కాంగ్రెస్‌ను శక్తి వంచన లేకుండా బలోపేతంచేస్తానని తెలిపారు.

బొజ్జా తిరుమలేష్‌కు సర్టిఫికెట్ ప్రదానం

కడప : విశాఖపట్నంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిర్వహించిన 'యువ క్రాంతి బునియాడి' శిక్షణా తరగతుల్లో వ్యక్తిగతంగా చురుకైన భాగస్వామ్యానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను కాంగ్రెస్ జాతీయ ఇన్‌ఛార్జి కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు చేతుల మీదుగా కడప జిల్లాకు చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ అందుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ట్రైనింగ్ ఇన్‌చార్జ్ సంతోష్ గోల్కొండ, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్ష రామయ్య, జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్ వల్లి, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారికి వివరాల అందజేస్తున్న నాయకులు

రుణాల అంగీకారంపై ఫెడరేషన్ నాయకుల హర్షం

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికులకు బ్యాంకు రుణాలు అందజేసేందుకు కమిషనర్, బ్యాంక్ అధికారులు ముందుకు రావడం పట్ల ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు తిరుపాల్, రవి మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు ఎంప్లాయిస్ వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు అధికారులు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ బాబు, ప్రకాష్, వెంకటేష్, శ్రీరామ్, కిరణ్ కుమార్, మార్, బాషా,లక్ష్మయ్య, నరసయ్య పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి విముక్తి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో పేట్రేగిపోతున్న కుక్కల దాడుల నుంచి ప్రజలను రక్షించేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ పోలా శ్రీనివాసులు రెడ్డి తిరుపతిలోని యానిమల్ కేర్ ల్యాండ్ వారి ద్వారా కుక్కలను పట్టుకునేందుకు గురువారం నుంచి శ్రీకారం చుట్టారు. యానిమల్ కేర్ ల్యాండ్ వారి ద్వారా పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకొని వాటిని జనావాసాలకు దూరంగా సురక్షితమైన ప్రాంతాలకు తరలించే విధంగా కార్యాచరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రజలకు కుక్కల బెడద నుంచి విముక్తి కలగనుంది. ఈ సందర్భంగా పోలా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండాఎటువంటి కార్యాచరణకైనా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

రక్షణ వ్యవస్థ నిర్వీర్యం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దేశ రక్షణ రంగంపై ఆదాని అంబానీలకు పెత్తనం ఇవ్వడం దేశ రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేయటమే అని పిసిసి డెలిగేట్ బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. ఏ. సత్తార్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అదానీ గ్రూపులో పెట్టుబడులు పెట్టిన కీలక విదేశీ పెట్టుబడుల సంస్థ అదానీ గ్రూపుతో కలిసి రక్షణ సంస్థకు యజమానిగా ఉండటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. తన సన్నిహితుల ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ దేశ భద్రతా ప్రయోజనాలను అదానీ గ్రూపుకు కల్పించటం దారుణమన్నారు. అదానీ సంస్థకు దేశ రక్షణ వ్యవస్థపై పెత్తనం కల్పించడం ద్వారా దేశ భద్రతకే ముప్పు ఏర్పడుతుంది అన్నారు. గతంలో కూడా రఫెల్ యుద్ధ విమానాలను అత్యధికంగా రెండింతల ధరతో అంబానీ సంస్థ ద్వారా కొన్నారు అన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఎపి మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-కడప సిటీ

ఎపి మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయమని వైఎస్ ఆర్‌టియుసి మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఆదాల వెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగ నియామకాలు చేపట్టడం చాలా ఆలస్యం అవుతున్నందున ముఖ్యమంత్రి స్పందించి బోర్డును ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బోర్డులో 17 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ బోర్డు ఏర్పాటు వల్ల రిక్రూ ట్‌మెంట్‌లో అక్రమాలకు అడ్డుకట్ట వేసినట్లయిందని తెలిపారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

కడప అర్బన్ : విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యాశాఖ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ప్రకాష్‌నగర్‌లోని జెఎస్ఒఎస్ అర్బన్ హాస్టల్ విద్యార్థులకు ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సహకారంతో సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ. 20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని తమ మాతృభూమికి ఏదైనా మంచి చేయాలనే ఉద్దేశంతో సాయం చేయడం అభినందనీయమన్నారు. పిల్లలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని అందుకు కృతజ్ఞతతో చక్కటి క్రమశిక్షణగల పౌరులుగా ఎదగి, సమాజానికి ఉపయోగపడే వనరులుగా తయారు కావాలన్నారు.

యువతను మోసగిస్తున్న సిఎం జగన్

- పాదయాత్రలో నారా లోకేష్

యువత సదస్సులో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలోని యువతను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసగిస్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 44వ రోజుకు చేరుకుంది. గురువారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని ఇందిరమ్మకాలనీ నుంచి ప్రారంభమైన పాదయాత్ర మల్లెల క్రాస్, టి.సదుం క్రాస్, సొన్నువారిపల్లి మీదుగా పెదతిప్పసముద్రం మండలంలోకి పాదయాత్ర ప్రవేశించింది. అక్కడి నుంచి మద్దయ్యగారిపల్లి శివారు వరకు పాదయాత్ర సాగింది. కొమ్మరపల్లి విడిది కేంద్రంలో బస చేశారు. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, యువతతో ముఖాముఖి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ వైసిపి పాలనలో యువత ఎక్కువగా నష్టపోయిందని తెలిపారు. టిడిపి పాలనలో ఎపి జాబ్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఉండేదన్నారు. జగన్ పాలనలో ఎపిని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చేశారన్నారు. 60 వేల మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే కనీసం గత ప్రభుత్వం కేటాయించిన డిగ్రీ కళాశాల పూర్తి చేయలేని పరిస్థితి ఉందన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని, ప్రతి ఏడాది 6,500 పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తానని మోసం చేశారని పేర్కొన్నారు.. ప్రతి ఏడాది డిఎస్సీ అన్నారన్నారు. ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది నోటిఫికేషన్ ఇస్తామని, అన్ని ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. జైలుకి వెళ్ళిన ఆర్థిక ఉగ్రవాదిని చూసి పెట్టుబడులు పెట్టడానికి ఎవరు వస్తారని, కోడి గుడ్డు మంత్రిని చూసి ఎవరు వస్తారన్నారు. జగన్ పాలనలో వచ్చిన ఒక్క పరిశ్రమ చూపించమని ఛాలెంజ్ చేస్తున్నానని పేర్కొన్నారు. టిడిపి తెచ్చిన కంపెనీలకి రిబ్బన్ కటింగ్ చేయడం తప్ప మీరు తెచ్చిన కంపెనీ ఒక్కటి అయినా ఉందా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ఆ తర్వాత మాటతప్పి మడమతిప్పడం జగన్ నైజమన్నారు. బుడుగ, బేడజంగాల సమస్యపై అధ్యయన కమిటీ నివేదిక పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి అభ్యర్థి గంటా నరహరి, నియోజకవర్గం ఇన్‌ఛార్జి జి.శంకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి 29 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -కడప అర్బన్

2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 14, 15 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇన్‌స్పైర్ జిల్లా ప్రదర్శనలో ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని డిఇఒ దేవరాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోనూ మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ నారాయణ, మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేస్తున్న డిఇఒ దేవరాజు

నాటుబాంబు కొరికి...కుక్కకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -నిమ్మనపల్లి

గాయపడిన కుక్క

మండల పరిధిలో ఎర్రప్పగారిపల్లి సమీపంలో పంట పొలాల వద్ద వన్యమృగాల వేటలో భాగంగా అమర్చిన నాటు బాంబును ఓ కుక్క కొరికి గాయాలపాలైంది. స్థానికుల కథనం మేరకు.. ఎర్రప్పగారిపల్లి సమీపంలో నూరు కుప్పలకొండ అటవీ ప్రాంతమైనందున గ్రామానికి సమీపంలో రైతులు సాగు చేసిన పొలాల్లోకి తరచూ వన్యమృగాలు వస్తుంటాయి. గుర్తు తెలియని వేటగాళ్లు నాటుబాంబులను, కరెంట్ తీగలను అమర్చి వాటిని వేటాడేవారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఒక కుక్క పొలాల వద్ద అమర్చిన నాటు బాంబును గ్రామానికి తీసుకొచ్చి కొరకడంతో బాంబు ఒక్కసారిగా పేలింది. ప్రమాదంలో కుక్క నోటికి తీవ్ర గాయాలయ్యింది. ఎర్రప్పగారిపల్లె సమీంలోని మోట్ల చెరువు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తీగలను అడవిలోకి అమర్చి వన్యమృగాలను వేటాడుతుంటారు. వేటగాళ్లపై అటవీశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులతో ప్రిన్సిపల్ వసుంధర

సాంకేతికంగా మంచి నైపుణ్యం సంపాదించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాబోవు రోజుల్లో సాంకేతికంగా మంచి నైపుణ్యం సంపాదించాలని ప్రిన్సిపల్ ఎస్.వసుంధర తెలిపారు. జెఎన్‌టియు కళాశాలలో రెండవ రోజు టెక్ ఫెస్ట్ 2K23 కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ వర్క్ షాపులో దాదాపుగా 250 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఒడి ఎస్‌జె సరిత, జి మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్ షాపును ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఈ వర్క్ షాపులను సివిల్ జెఎన్‌టియు కళాశాల విద్యార్థులే నిర్వహించడం అభినందనీయమన్నారు. నూతన సాంకేతిక జ్ఞానాన్ని పెంచుకోవడమే కాకుండా జ్ఞానాన్ని పంచడంలో కూడా జెఎన్‌టియు విద్యార్థులు ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆర్.రమణారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాపు, బిసి సంఘం నాయకులు

కాపు, బిసిలు సిఎం జగన్‌కే మద్దతు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కాపులు, బిసిలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే మద్దతని బిసి నాయకులు వరప్రసాద్, కాపు నాయకులు సంఘం అధ్యక్షులు ప్రసాద్, రాయలసీమ కాపునాడు అధ్యక్షులు సోపాల వీర, బేల్దారి సంఘం మాజీ అధ్యక్షులు పెద్ద వీరయ్య, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి తెలిపారు. స్థానికంగా గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ కుల రాజకీయాలు మానుకోవాలని సూచించారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయ సిద్ధాంతం లేని పార్టీ జనసేన అన్నారు. పవన్‌కళ్యాణ్ కాపు జనసేన పార్టీ కాదని.. కమ్మ జనసేన పార్టీ అని విమర్శించారు. చంద్రబాబు దమ్ముంటే పవన్‌కళ్యాణ్‌ను అడ్డు పెట్టుకొని గెలవాలని చూడడం అవివేకమన్నారు. కుతంత్రాలు పన్నినా 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికవుతారని తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ప్రజాశక్తి - ఖాజీపేట

పోలీస్‌స్టేషన్‌లో ఉన్న జె.గంగావతి

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు (ఐఎఫ్‌టియు అనుబంధ సంస్థ) జె.గంగావతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్లకు సంబంధించి వేతనాలు పెంపు కోరుతూ శుక్రవారం చేపట్టనున్న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా పోలీసులు ఆమెను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సమస్యల సాధన కోసం శాంతియుతంగా పోరాటాలు సాగించాలనుకుంటే పోలీసులచే ముందస్తు అరెస్టులు చేయించడం ఎంతవరకు సమంజసమని తెలిపారు. పోలీసుల అణచివేత చర్యలతో తమ హక్కులను, పోరాటాలను అడ్డుకోవాలని చూడడం ప్రభుత్వానికి తగదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కంటే వేయి రూపాయలు అధికంగా ఇస్తామని హామీ ఇచ్చి.. నేడు మాట తప్పడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఆమె హెచ్చరించారు.

ప్రశాంతంగా సీనియర్ ఇంటర్ పరీక్ష

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని శ్రీ వివేక వర్ధిని ఎయిడెడ్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం సీనియర్ ఇంటర్ పేపర్-2 తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్షకు 157 మంది విద్యార్థులకుగానూ నలుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలోని ఇంటి ఓబయపల్లి గ్రామ విఆర్ఎ కాటమయ్య (46) అనారోగ్యంతో మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి ఆయనను పులివెందుల ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం మృతి చెందారు. మృతదేహం వద్ద తహశీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ సురేంద్ర నివాళులర్పించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

విద్యా సామగ్రి పంపిణీ అభినందనీయం

లింగాల : పదవ తరగతి విద్యార్థులకు విద్యా సమగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని కోమ న్నూతల ప్రధానో పాధ్యాయురాలు నాగమణి తెలిపారు. మండల పరిధిలోని కోమనూతల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గురువారం కెనడా దేశానికి చెందిన ఒటిఎఫ్ ఆర్గనైజర్ వారు పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవ సమితి ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ మారుమూల గ్రామాల 10వ తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ వల్ల విద్యార్థులు మానసిక దృఢతత్వం, రెట్టింపు ఉత్సాహంతో పరీక్షలు రాసేందుకు ఎంతగానో తోడ్పాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సేవా సమితి నిర్వాహకులు రాజు, మస్తాన్, బాషా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - చాపాడు

షేక్ బషీరూన్

మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన షేక్ బషీరూన్ బుధవారం నుంచి కనిపించడం లేదని గురువారం ఆమె కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోజు మాదిరిగానే ఇంటి దగ్గర ఉన్న బషీరూన్ బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని బంధువులు, సన్నిహితుల గ్రామాల్లో విచారించినప్పటికీ ఆచూకీ లభించలేదని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా బషీరున్ ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వాలని పోలీసులు సూచించారు.

అగ్నిమాపక కేంద్రం నిర్మాణం జరిగేనా..!

- రెండేళ్ల కిందట మంజూరు.. నిరుపయోగంగా స్థలం

ప్రజాశక్తి - ముద్దనూరు

తాడిపత్రి రోడ్డులో కేంద్ర నిర్మాణానికి కేటాయించిన స్థలం

ముద్దనూరు అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ఎప్పుడూ నోచుకుంటుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో జమ్మలమడుగు తాలుకాకు సంబంధించి ఒకటే అగ్నిమాపక కేంద్రం ఉండేది. దీని పరిధిలో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం మండలాలున్నాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే అగ్ని మాపక వాహనం జమ్మలమడుగు నుండి రావాల్సిందే. ఈలోపు ప్రమాదం తీవ్రమై భారీ నష్టం జరిగేది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 2020లో ముద్దనూరుకు అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసింది. ఆ మేరకు రెవెన్యూ అధికారులు తాడిపత్రి రహదారిలోని చెన్నారెడ్డిపల్లె వద్ద దాదాపు ఎకరా స్థలాన్ని కేటాయించారు. భవనం, ప్రహరీ, నిర్మాణానికి కోటి రూపాయలను మంజూరు చేసింది. రెండేళ్లవుతున్నా.. నేటికి భవని నిర్మాణానికి పునాదులు కూడా పడలేదు. ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటైతే ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల, తొండూరు, సింహాద్రిపురం మండలాలకు అందుబాటులో ఉంటుంది. అగ్నిమాపక కేందర్రంలో ఒక ఆఫీసర్, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఆరుమంది ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు ఉంటారు. భవన నిర్మాణానికిగల కారణాలేంటో తెలియడంలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే అగినమాపక కేంద్రం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పన్ను చెల్లించకపోతే రిజిస్ట్రేషన్లు రద్దు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మాట్లాడుతున్న కమిషనర్ మీరా ప్రసాద్

వాహనాల పన్ను చెల్లించకపోతే రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంవిఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ వాహనాదారులు మూడు నెలలకోసారి ప్రభుత్వానికి పన్ను తప్పనిసరిగా చెల్లించాలన్నారు. మీ-సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ కేంద్రాలు, సచివాలయాల్లోకానీ పన్నులు చెల్లించవచ్చున్నారు. జిల్లాలో 7,014 వాహనాల పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో 3,162 గూడ్స్ వాహనాలు, 2,018 ట్రాక్టర్స్ ఉన్నాయన్నారు. రైతులకు అవగాహన లేకపోవడం వల్ల పన్నులు సక్రమంగా చెల్లిం చలేదన్నారు. జిల్లాలో 36 మందితో 9 బృందాలను ఏర్పాటు చేసి ఏడు రూట్లల్లో వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. వాహనాలు తనిఖీ చేసి ఇప్పటివరకు 350 కేసులు నమోదు చేశామన్నారు. పన్ను చెల్లించని వారికి నోటీసులు కూడా ఇచ్చామన్నారు. పన్ను కట్టకపోవడం వల్ల వాహనాలకు ఏదైనా ప్రమాదం జరిగితే బీమా వర్తించదన్నారు. అనంతరం పొట్టి శ్రీరా ములు జయంతి సందర్భంగా ఎంవిఐ కార్యాలయంలో చైతన్య విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్య క్రమంలో ఎంవిఐ వెంకట ప్రసాద్, పవన్‌కుమార్, ఇలియాస్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

మాట్లాడుతున్న నజీర్ అహ్మద్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సామాజిక అభివృద్ధితోపాటు అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఆ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ అహ్మద్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నూతనంగా నిర్వహిస్తున్న 'హాథ్‌సే హాథ్‌జోడో అభియాన్' కార్యక్రమం సందర్భంగా నజీర్ గురువారం 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. స్వతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశం సాధించిన ప్రగతి కాంగ్రెస్ చలువే అన్నారు. ప్రాంతీయ పార్టీల పాలనలో కుల, వర్గ రాజకీయాలు చోటుచేసుకోవడం శోచనీయమన్నారు. జాతీయ వాదంతోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇటీవల ముగిసిన ప్లీనరీ సమావేశంలో ముఖ్యమైన తీర్మానాలు చేశారన్నారు. వ్యవసాయ రుణం రూ.6లక్షల వరకు మాఫీ చేస్తామన్నారు. రూ.500కు వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామన్నారు. కడు నిరుపేద కుటుంబాల జీవనోపాధికి నెలకు రూ.6వేలు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అమలుచేస్తామన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా అభివృద్ధి ప్యాకేజి అమలు చేస్తామన్నారు. కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్, దుగ్గరాజపట్నం ఓడరేవు, పోల వరం ప్రాజెక్ట్, విశాఖ రైల్వేజోన్ సహా విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలు చేస్తామన్నారు. ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం అందజేస్తామన్నారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తామని నజీర్‌అహ్మద్ తెలిపారు.

అమరజీవి త్యాగం ఆదర్శనీయం

పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కలెక్టర్ వి. విజయ్ రామరాజు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి జెసి సాయి కాంత్ వర్మతో పాటు బిసి వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయులు అమరజీవి అని పేర్కొన్నారు. దేశంలోని భాషా ప్రయుక్త రాష్ట్రాలకు అశేష స్ఫూర్తిగా నిలిచిన ఆయన మన తెలుగువారని చెప్పుకోవడం గర్వకారణం అన్నారు. అంతటి మహోన్నతమైన స్వాతంత్ర్య సమరయోధులు, అమరజీవి పొట్టిశ్రీరాముల త్యాగాన్ని ఇప్పుడు తెలుగువారందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కులమతాలకు అతీతంగా అట్టడుగు వర్గాల ప్రజలతో మమేకమై.. వారి సాధకబాధలు పంచుకునేవారన్నారు. మానవులంతా ఒక్కటే కుల మత భేదం ఉండకూడదనే నినాదంతో ముందుకు వెళ్లే వారన్నారు. దేశంలో కుల వివక్షత అధికంగా ఉన్న ఆ రోజుల్లో సామాజిక రుగ్మతల పట్ల పోరాటం చేశారన్నారు. తెలుగు భాష మాట్లాడే వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దృఢ సంకల్పంతో నిరాహార దీక్ష చేపట్టి 1952 డిసెంబర్ 15న అర్ధరాత్రి తన ఆశయ సాధనకు ప్రాణాలర్పించి అమరజీవి అయ్యాడన్నారు. తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని గాంధేయ మార్గంలో పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమర జీవి త్యాగాన్ని ఈ తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి ముందుగా జిల్లా వి. విజయ్ రామరాజు, జేసీ సాయి కాంత్ వర్మ, బీసీ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం అమరజీవి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రామ్మోహన్ రెడ్డి, ఎస్ఐసి విజయ్ కుమార్, డిసిఒ సుభాషిణి, ఎల్‌డిఎం దుర్గా ప్రసాద్, సిపిఒ వెంకటరావు, స్టెప్ సిఇఒ సాయి గ్రేస్, జిల్లా అధికారులు,అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. **కడప :** ఆంధ్ర రాష్ట్ర సాధకులు అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జయంతి సందర్భంగా కడప నగరంలోని గోకుల్ సర్కిల్‌లో విగ్రహానికి గురువారం వైసిపి జిల్లా అధ్యక్షులు, కడప నగర మేయర్ సురేష్ బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు సూర్య నారాయణ , మల్లికార్జున, జిల్లా బిసి విభాగ అధ్యక్షుడు బంగారు నాగయ్య పాల్గొన్నారు. **ముద్దనూరు :** స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు రమేష్, గంగిరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయరెడ్డి, ప్రతాప్, వాసు, పెద్దన్న, కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** మద్యపాన నిషేధం, గిరిజనుల ఆలయ ప్రవేశం, జైళ్ల సంస్కరణల కోసం జీవితాంతం పోరాడిన పోరాట యోధుడు అమరజీవి పొట్టి శ్రీరాములని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆత్మ బలిదానం చేసిన అమరజీవి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన ఆత్మ శాంతి కోసం పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, చెన్నకేశవ, ఉత్తన్న, శివ, వెంకటేష్, బద్రీ, రాఘవయ్య పాల్గొన్నారు. **చాపాడు :** స్థానిక శాఖ గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇందిరా క్రాంతి పథకం ఎపిఎం వెంకటరమణ, సిసిలు దయానిధి, నాగన్న, జీవన్ సచివాలయ ఉద్యోగులు జానకిరామ్, ఆఫ్రిన్, భారతి, బిడిసి భైరవుడు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహా పురుషుడు అమరజీవి పొట్టిశ్రీరాములని పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం అన్నారు. అమరజీవి జయంతి సందర్భంగా గురువారం స్థానిక రామేశ్వరం బాల బాలికల గ్రంథాలయంలో పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, మాజీ వైమానిక దళ అసిస్టెంట్ ఇంజనీరు వెంకట కొండయ్య ముఖ్య అధితులుగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రం సాహెబ్, రమణారెడ్డి, గిద్దలూరు శ్రీనివాసులు, రవిచంద్ర, ప్రభాకరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆర్‌టిపిపిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌టిపిపి సమావేశ హాలులో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి సిఇ ఎం.మురళీకృష్ణ, ఉన్నతాధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఇలు కె.సోమశేఖర్‌రెడ్డి, ఎం.దేవేంద్ర నాయక్, టి.రవికుమార్, ఎన్.వెంకట్రావు, డి.వీరబాబు, ఎ.సాంబశివరావు, ఎస్.శ్రీధర్, జిఎం ఫైనాన్స్ సి.వి.రమణరా, ఫ్యాక్టరీ మేనేజర్ సిద్దయ్య, ఎఎస్ చార్లెస్, ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ వెన్నపూస సుబ్బిరెడ్డి పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని పూల అంగళ్ళ కూడలి వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, కో-ఆప్షన్ సభ్యులు దాసరి చంద్రమౌళి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లెలో వర్షం..రోడ్లు జలమయం

ప్రజాశక్తి - వేంపల్లె

జలమయమైన రోడ్డు

వేంపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం పడింది. వాతావరణ మార్పులు చోటు చేసుకున్న క్షణాల్లోనే వర్షం ఒక్కసారిగా కురవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. డ్రెయినేజీ కాలువలు సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. డ్రెయినేజీ కాలువల్లోని మురుగు నీరు రోడ్లపై ప్రహహించడంతో పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. వేసవిలో వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

జ్యోతి ప్రజ్వలనలో వైసిపి నాయకులు, నిర్వాహకులు

ట్రెండ్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలో కొత్తగా ట్రెండ్స్ షోరూంను ప్రారంభించడం హర్షణీయమని వైసిపి సీనియర్ నాయకులు లక్కిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ట్రెండ్స్ షోరూంను గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణం అభివృద్ధిపథంలో ముందుకు దూసుకెళుతోందన్నారు. పట్టణంలో ఇలాంటి షోరూంలు మరెన్నో ప్రారంభించాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ్మలమడుగు అభివృద్ధిపై ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో స్టీల్ ప్లాంట్ నిర్మాణం వేగవంతం అవుతుందన్నారు. భవిష్యత్‌లో జమ్మలమడుగు వాణిజ్య వ్యాపారాలకు కేంద్ర బిందువుగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

19న కవిత్రయ కవితా వైభవం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ఈ నెల 19న ప్రొద్దుటూరు జార్జిక్లబ్‌లో నందనందన కళా మండలి అధ్యక్షుడు ఎం.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కవిత్రయ కవితా వైభవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతరించిపోతున్న కళలు, కవితల పూర్వ వైభవం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖ, గొప్ప కవులు, సాహితీ వేత్తలు పాల్గొంటారని తెలిపారు. పట్టణ ప్రజలు, నాటక, కవిత, సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు. అంతరించిపోతున్న సాహిత్యాన్ని ముందు తరాలకు అందించడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ నరాల రామారెడ్డి, డాక్టర్ నాగ దస్తగిరిరెడ్డి పాల్గొంటారని నంద నందన కళా నాట్యమండలి అధ్యక్షులు ఎం.రామ సుబ్బారెడ్డి, పుట్టపర్తి సాహితీ పీఠం అధ్యక్షులు జింక సుబ్రమణ్యం తెలిపారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా చేపట్టే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాళ్లపల్లె పిహెచ్‌సి వైద్యులు నిజాముద్దీన్ కోరారు. మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గర్భిణులకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాముద్దీన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. గ్రామీణా ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. గర్భిణులకు అల్బెండజల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆశా వర్కర్లలను కోరారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల చాల ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నిషా బేగం, సిహెచ్ఒ వెంకటరత్నం ఆశా వర్కర్ల, గర్భిణులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న రహంతుల్లా

వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని, అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా కోరారు. గురువారం వేం పల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న మహిళలతో పారిశుధ్యంపై ఆయన చర్చిం చారు. ఈ సందర్భంగా రహంతుల్లా మాట్లాడుతూ వేంపల్లెలో కుక్కల దాడి ఎక్కువైందన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో వీధులు కంపు కొడుతున్నాయని తెలిపారు. దోమలు విపరీతంగా ఉన్నాయని ఆం దోళన వ్యక్తం చేశారు. మురుగు కాలువల్లో పుడికతీత పనులు చేప ట్టలేదన్నారు. మండలస్థాయిలో పని చేసే అధికారులు మున్సిపల్, కార్పొ ేషన్ వంటి పట్టణాల్లో నివాసం ఉండడంతో వేంపల్లెలోని వీధుల్లో ఉన్న అపరిశుభ్రత వారికి కనపడలేదని ఎద్దేవా చేశారు. కాలువల్లో ఉన్న చెడు వ్యర్థాలను తొలగించి కంపు లేకుండా చేయాలని కోరారు. దోమలను నివా రించడంతోపాటు కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని కోరారు.

చాపాడు సచివాలయ సిబ్బందిలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ సుబ్రహ్మణ్యం

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని జమ్మలమడుగు డిఎల్‌పిఒ విజయభాస్కర్, డిఎల్‌డిఒ సుబ్రమణ్యం తెలిపారు. మండల పరిధిలోని పలు సచివాలయాలను వారు వేర్వేరుగా తనిఖీ నిర్వహించారు. పల్లవోలు, చాపాడు, లక్ష్మీపేట, పెద్దగురువులూరు, చిన్నగురువులలూరు సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సూచించిన సమయానికి బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని రికార్డులో నమోదు చేసి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కెవి శ్రీధర్ నాయుడు, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అందుకోవాలి

నందలూరు : విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డిలు కోరారు. బుధవారం సాయంత్రం గొబ్బిళ్ళ అక్షర పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, కరస్పాండెంట్ గొబ్బిళ్ళ శ్రీనాథ్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలన్నారు. స్పెషల్ ఆక్టివిటీస్ లో మెరుగైన ఫలితాలను సాధించిన విద్యార్థులకు మెడల్స్, మెమొంటోలను అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు తల్లిదండ్రులు సహకారాన్ని అందించాని కోరారు. విద్య, క్రమశిక్షణ, శానిటేషన్, డిజిటల్ క్లాస్సెస్, ఆర్గానిక్ అగ్రికల్చర్, లాబ్స్‌తో పాటు స్కూల్ చేపడుతున్న కార్యక్రమాల గురించి నిశితంగా వివరించారు.

శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయము
పాలూరు (గ్రా), పెద్దముడియం (మం), కడప జిల్లా.
e-Procurement Tender
NIT NO. COE/1550/2022-5 Dt:18-01-2023
దేవాలయ పున:నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు http://tender.apeprocurement. gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : ధర్మకర్త